క్లుప్తంగా

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక బీరప్ప ఆలయ కల్యాణ మంటపంలో ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి మండలస్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు హాజరుకావాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఉదయం 10 గంటలకు మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, సమన్వయకర్త ఈరలక్కప్ప సమావేశంలో పాల్గొంటారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైద్య సిబ్బంది పనితీరు ఎలా ఉంది ?



లేపాక్షిలో వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి పల్స్ పోలియో తదితర కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పనితీరు గమనించి వారిని అభినందించారు. పల్స్ పోలియో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విక్రమ్, వైద్యులు వెంకటచిరంజీవి, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

నేడు లేపాక్షిలో హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు హాజరు కావాలని కోరారు.

7న సంతల బహిరంగ వేలం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని దినసరి, వారపు సంతలు, బస్టాండ్ ఖాళీ స్థలానికి సంబంధించిన సుంకం వసూలు హక్కులు పొందేందుకు ఈనెల 7న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగం వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రంగస్వామి తెలిపారు. అలాగే అక్కంపల్లి చెరువుపై ఉన్న చింతచెట్ల ఫలసాయాన్ని కూడా వేలం వేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

మద్యం తరలించకుండా చర్యలు

మడకశిర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టనున్నట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మట్లాడుతూ ప్రధానంగా కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల్లో తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం, డబ్బు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బాలికలను బాగా చదివించాలి

అమరాపురం: బాలికలను బాగా చదివించాలని ఉన్నతస్థానం నిలపాలని గుడిబండ ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భేటీ పడావో.. భేటీ బచావోపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు నిర్వహించారు.

పౌష్టికాహారం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని మెళవాయి పంచాయతీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు హక్కులపై అవగాహన పెంచుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

అమ్మ చేతి గోరు ముద్దలా..

- ప్రభుత్వ బడుల్లో పకడ్బందీగా జగనన్న గోరుముద్ద
- పోషకాలతో కూడిన ఆహారం అందేలా ప్రభుత్వం చర్యలు
- విద్యార్థులు కడుపునిండా భోజనం చేస్తుండటంపై తల్లిదండ్రుల హర్షం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



రాగి జావను తాగుతున్న విద్యార్థులు

అమరాపురం/గుడిబండ: ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న గోరుముద్ద' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పోషకాలతో కూడిన భోజనాన్ని వడ్డించడంతో పాటు రాగిజావ కూడా అందిస్తున్నారు. ఉన్నతాధికారులు, మండలాధికారులు ఎప్పటికప్పుడు ఆయా స్కూళ్లను తనిఖీ చేస్తూ పక్కాగా మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. తమ బిడ్డలు కడుపు నిండా భోజనం చేస్తుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో ముద్ద అన్నం.. నీళ్ల చారే గతి

గత టీడీపీ ప్రభుత్వ హయంలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండేది. ముద్దగా వున్న అన్నం, నీళ్ల చారు అందించే వారని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు భోజనం చేయకుండానే ఇళ్లకు వెళ్లేవారు. తినే వారు కూడా సగం అన్నాన్ని బయటికి వేసేవారు.

మెనూలో సమూల మార్పులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మెనూలో సమూల మార్పులు చేపట్టింది. గతంలో కోడిగుడ్డు విద్యార్థులకు అందని ద్రాక్షగా మిగిలేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారానికి ఆరు కోడిగుడ్లను ఒక్కో విద్యార్థికి ఇస్తున్నారు. అలాగే వారానికి మూడు రోజులు రాగి జావ ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇంటికి పోకుండా క్యారేజ్ తీసుకు రాకుండా పాఠశాలలో తృప్తిగా భోజనం చేస్తున్నారు.

మెనూ ఇలా...

సోమవారం: హాట్ పొంగల్ ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ
బుధవారం: కూరగాయల అన్నం, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం: సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ

మడకశిర నియోజకవర్గంలో అమలు ఇలా...

మండలం	మధ్యాహ్న భోజనం తీసుకుంటున్న విద్యార్థులు
అమరాపురం	4,788
గుడిబండ	5,515
రొళ్ల	4,136
అగళి	3,420
మడకశిర	8,585
మొత్తం	26,444

భోజనం చాలా బాగుంటుంది



మా పాఠశాలలో అందించే మధ్యాహ్న బోజనం చాలా బాగుంటుంది. రోజుకో మెనూ ప్రకారం వంట చేస్తున్నారు. నిజంగా ఇంటిలో కన్నా పాఠశాలలోనే భోజనం బాగుంటుంది. రోజూ కోడిగుడ్డు ఇస్తున్నారు. తృప్తిగా తినగలుగుతున్నాం. చాలా సంతోషంగా ఉంది. – విద్య, 9వ తరగతి, ఏపీ మోడల్ పాఠశాల, హలుకూరు

మెనూ ప్రకారం వడ్డిస్తున్నారు



మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నారు. కోడిగుడ్డుతో పాటు వారానికి మూడు సార్లు రాగి జావ, చిక్కిలు ఇస్తున్నారు. పౌష్టికాహారంతో అందరం ఆరోగ్యంగా చదువుకోగలుగుతున్నాము. – వైష్ణవి, 9వ తరగతి, వలస ఉన్నత పాఠశాల, అమరాపురం

రాగి జావంటే ఇష్టం



వారంలో మూడు రోజులు ఇస్తున్న రాగి జావ అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్‌కు వచ్చిన వెంటనే ప్రార్థన తరువాత రాగి జావ ఇస్తున్నారు. మేమంతా ఇష్టంగా తాగుతున్నాం. మా అమ్మ కూడా రాగి జావ బలాన్నిస్తుందని చెప్పింది. రుచికరమేన వంటకాలు అందిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్. – తనుశ్రీ, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, గుడిబండ.

రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు..



గతంతో పోల్చితే మధ్యాహ్న భోజన పథకం మెనూలో చాలా మార్పులు వచ్చాయి. రోజూ వేడి వేడి ఆహార పదార్థాలను అందిస్తున్నారు. నిత్యం ఓ టీచర్ రుచి చూసిన తరువాత విద్యార్థులకు వడ్డిస్తున్నాము. ఏదైనా లోటు పాట్లు ఉంటే విద్యార్థుల నుంచి సలహా తీసుకుని పొరపాటు లేకుండా చూస్తున్నాం. – నరసింహమూర్తి, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, అమరాపురం

రాజీపడకుండా అమలు



జగనన్న గోరు ముద్ద అమలుతో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఉపాధ్యాయుల కమిటీ పర్యవేక్షణలో నాణ్యతతో రాజీ పడకుండా జగనన్న 'గోరుముద్ద' పథకాన్ని అమలు చేస్తున్నాం. – రవిచంద్రకుమార్, ఎంఈఓ, గుడిబండ

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం





మెగా చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈరలక్కప్ప , సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈరలక్కప్ప

అమరాపురం: మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింట్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. సోమవారం అమరాపురం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో ఏరియా కో ఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. తొలిత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి నాయకులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బోయ శాంతమ్మ, ఈరలక్కప్ప మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్దపీట వేశారని తెలిపారు. జగనన్నతోనే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలతో పాటు రాజకీయంగా కూడా మహిళలకు అగ్ర స్థానం కల్పిస్తున్నట్లు చెప్పారు. సంఘాల సభ్యులు మాఫీ చేసిన రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మహిళలక తీరని అన్యాయం జరిగిందని, రుణమాఫీ చేస్తానని హమీ ఇచ్చి అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు... పవన్‌కళ్యాణ్‌తో జతకట్టి వస్తున్నారని, వారి మాటలు నమ్మకుండా జగనన్నను ఆశీర్వదించాలన్నారు. అనంతరం 895 సంఘాలకు 10,149 మహిళా సభ్యులకు రూ. 7.43 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీలు క్రిష్ణమూర్తి, లలితమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి

హిందూపురం: మహిళాసాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అక్కచెల్లెమ్మలందరూ అండగా నిలవాలని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద హిందూపురం మండలంలో 890 డ్వాక్రా సంఘాల్లో 9,172 మంది లబ్ధిదారులకు రూ.6.32 కోట్ల రుణమాఫీ చేశారు. స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీఓ వెంకటశివరెడ్డి ఆధ్వర్యంలో ఆసరా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేణురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నాగభూషణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పసుపు -కుంకుమ పేరుతో మహిళలను మోసగించిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు అన్ని డ్వాక్రా సంఘాలు కళకళలాడుతూ ఆర్థిక పురోగతి సాధించాయంటే కేవలం జగనన్న చలువేనన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏసీ రామిరెడ్డి, ఏపీఎం రామకృష్ణ, మహిళా సంఘ అధ్యక్షురాలు సిద్ధగంగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, శ్రీరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆసరా వారోత్సవానికి హాజరైన మహిళలు



మహిళా సంఘాలకు మెగా చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

ఓటమి భయంతోనే పొత్తులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- ఎన్ని పార్టీలు కలిసినా గెలుపు వైఎస్సార్‌సీపీదే
- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: ఓటమి భయంతోనే ప్రతి పక్ష పార్టీలు పొత్తులతో ఎన్నికలకు సిద్ధం అయ్యాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని నాగళూరు, అడదాకులపల్లి, మావటూరు గ్రామాల్లో బూత్ కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓటమి భయంతోనే తెలుగుదేశం, జనసేన పార్టీలు కలసి పోటీ చేస్తున్నాయన్నారు. అన్ని పార్టీలు కలసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. సీఎం జగనన్న ఆధ్వర్యంలో పక్కాగా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధే తమను మరోసారి గెలిపించబోతోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా వైఎస్‌జగన్ నెరవేర్చారన్నారు. అయితే గతంలో 600 హామీలు ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు, సర్పంచులు అలివేలమ్మ, నాగరాజు, సునంధమ్మ, ఎంపీటీసీలు రత్నమ్మ, శివయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు, నాయకలు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్యామునాయక్, ఆదినారాయణ, గోవర్ధన్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి

వైఎస్సార్‌సీపీలో చేరిక..

పెనుకొండ: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ వర్గీయులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్, నవీన్, రాజు, భరత్, చిరంజీవి, రామన్న, మునెప్ప, ఈశ్వరప్ప, చిన్నంజి, ధన, ప్రదీష్, అశోక్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ తన కార్యాలయంలో వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు ఆత్మీయ పలకరింపు

పెనుకొండ: పట్టణంలో మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. 15వ వార్డులోని కటిక వీధి, జీవీసీ కాలనీ, వసంత వీధిలో కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

17 మంది గైర్హాజరు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఇంటర్ పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. మొత్తం 378 మంది హాజరు కావాల్సి ఉండగా 361 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు పేర్కొన్నారు. 17 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వైఎస్సార్ సీపీ నాయకుడు వేణురెడ్డి సోమవారం బాధితులకు అందజేశారు. మండల పరిధిలోని కగ్గల్లుకు చెందిన సుధాకర్‌రెడ్డి రూ.65 వేలు, కొటిపి గ్రామానికి చెందిన రాజమోహనకృష్ణకు రూ.6.30 లక్షలను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగభూషణం, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మహేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

హిందూపురం టౌన్: ఎన్నికల్లో ధన, వస్తు, ఇతరత్రా ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా నీతి, నిజాయితీ, నిబద్ధతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు, ఎన్ఎస్ఎస్ స్టేట్ అవార్డు గ్రహీత నందిత అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, ఎస్ఆర్ ఎడ్యూకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓటర్ ఎడ్యూకేషన్, స్వీప్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతపై క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ప్రిన్సిపాల్ కరీంకు ఘన నివాళి

పరిగి: ప్రభుత్వ దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ కరీం సేవలు అమోఘమని వక్తలు తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కరీం సంస్మరణ కార్యక్రమం సోమవారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. కరీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరీం సేవలను కొనియాడారు. కరీం భార్య ఫాతీమా, ప్రస్తుత ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పరిగి చెరువులో వ్యక్తి గల్లంతు

పరిగి: మండలంలోని అతి పెద్దదైన పరిగి చెరువులో ఓ వ్యక్తి గల్లంతైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సోమవారం ఉదయం ధనాపురం సమీపంలో చెరువు గట్టు వద్ద వ్యక్తికి సంబంధించిన బట్టలు పడి ఉన్నట్లు అటువైపు వెళ్లిన స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అక్కడికి పెద్ద ఎత్తున గ్రామస్తులతో పాటు పోలీసులు చేరుకుని చెరువులో పడి ఉంటాడన్న అనుమానంతో గాలింపు చర్యలను చేపట్టారు. హిందూపురం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని రెస్క్యూ నిర్వహించారు. సాయంత్రమైనా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు, రెస్క్యూ టీం వెనుదిరిగారు. కాగా గల్లంతైన వ్యక్తి ధనాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా స్థానికులు చెబుతున్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని కొత్తపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొనడంతో చల్లాపల్లికి చెందిన నర్సిరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం పెనుకొండ వద్ద టీడీపీ తలపెట్టిన రా కదలిరా కార్యక్రమానికి వెళ్లి వస్తున్న ఆటో.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ నర్సిరెడ్డిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మొరాయించిన సర్వర్

పెనుకొండ: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ కోసం వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే మధ్యాహ్నం సర్వర్ రావడంతో సిబ్బంది ప్రజలకు ఇబ్బంది లేకుండా చూశారు.

నేడు 'భానుమతి' పుస్తక పరిచయం

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 1930 నాటి నవల 'భానుమతి' పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్యక్షులుగా పనిచేసిన యం.వి.పాపన్నగుప్తా రచించిన భానుమతి నవలను దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రస్తుత అధ్యక్షుడు పోలిశెట్టి ఓబయ్య మంగళవారం ఆవిష్కరిస్తారన్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు అంకె శ్రీనివాస్ పరిచయం చేస్తారని తెలిపారు.

రోటరీ నారాయణప్ప కన్నుమూత



నారాయణప్ప (ఫైల్)

పావగడ: స్థానిక రోటరీ మాజీ అధ్యక్షుడు నారాయణప్ప (83) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గతంలో ఆయన వరుసగా రెండు పర్యాయాలు రోటరీ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఎనలేని సామాజిక సేవలందించారు. ముఖ్యంగా క్యాన్సర్, గుండె రోగులకు ఉచిత చికిత్స అందించారు. ఆయన మృతి పట్ల రోటరీ అధ్యక్షుడు సత్య లోకేశ్, మాజీ అధ్యక్షుడు వైఎస్ హనుమంతరాయప్ప, ప్రభాకర్ తదితరులు సంతాపం తెలిపారు.